# భ్రష్టజీవి

రచన:— శ్రీ బి. పురుషోత్తము.

స్కూల్ ఫైనలు పరీక్షలో రెండు దండయాత్రలుచేసి మూడోసారి ఉత్తీర్ణుడయ్యేసరికి గగనమయింది జయరాంకు. బీదకుటుంబానికి చెందినవాడు కావటం, తండ్రికి పెద్దకుమారుడు కావటం, ఏదో ఓనౌకరిలో ప్రవేశించి, తన సంసారం తాను పోషించుకొంటు, తండ్రికిగూడ యింత చేదోడు కావాలనుకొన్నాడు. నిరుద్యోగ సమస్య ప్రళయ తాండవం చేస్తున్నరోజులు పెద్దలను ఆశ్రయించగా ఆశ్రయించగా భగీరథప్రయత్నంమీద చెంతనున్న పట్టణంలోని ఐ. యల్. టి. డి, కంపెనీలో జయరాంకు ఒక చిన్న నౌకరి ప్రాప్తించింది. రోజుకు మూడుపావలాలవంతున కూలీలకులాగా యిచ్చేవారు. దొరికిందే మహాభాగ్య మనుకొని క్రొత్తగావచ్చిన భార్యతో ఆడుళ్ళో సంసారం నెలకొల్పాడు.

క్రొత్తగా కాపరాలకు వచ్చిన భార్యలకు కోరికలెక్కువ. వాళ్ళు సంసారపరిస్థితులు గుర్తించలేరు. వెఱ్ఱివెఱ్ఱి విలాసాల్లోబడి ఆర్థిక దురవస్థలను అచిరకాలంలోనే కలుగజేస్తారు. ఏ మొదటినెల చల్లగాగడించిందో జయరాంకు తరువాతనుంచి సంసారచక్రం వెనుకకు తిరుగనారంభించింది. భార్యామోహంలో, ఆమెకోరికకు యెదురు చెప్పేవాడు కాదు. ఆమె తీసుకువెళ్ళమన్న సినిమాలకు తలతాకట్టుపెట్టయినా తీసుకువెళ్లటం జరుగుతున్నది. జయరాం యీవిధంగా అయినచోట కానిచోట అప్పులుచేస్తుండటం తండ్రికి కర్ణాకర్ణికగా తెలిసింది. ఒకనాడు పయనమైవచ్చి పరిస్థితులన్నీ పరికించాడు. కొడుకును ఏకాంతంగా పిలిచి జాగ్రత్తగా వుండవలసిందని హెచ్చరించాడు. ఎలాగయిన నాలుగు రూపాయలు మిగిల్చి గంపంత సంసారానికి వేడినీళ్ళకు చన్నీళ్ళులాగా సహాయకారిగా వుండవలసిందని కోరాడు. పాపం జయరాంకు మొదటినుంచీ తండ్రికి పెద్దకొడుకు అయినందుకు అన్నిధాల కుడిభుజంలాగా వుండాలని మనస్ఫూర్తిగావుంది. తండ్రిచేత ఆ విధంగా చెప్పించుకొన్నందుకు ఆ రాత్రి అల్లా పరితపించాడు. ఇహనైన జాగ్రత్తగా వుందామని నిశ్చయించుకొన్నాడు.

నెలరోజులు ప్రశాంతంగా జరిగిపోయాయి. తిరిగి మొదటితారీఖు వచ్చింది. తండ్రివచ్చి కొడుకు జీతంలో అయిదురూపాయిలు తీసుకువెళ్ళాడు. మిగతాదాంతో నెలరోజులు గడపాలి యెలాగా అని దిగులుచెందుతూ కాలక్షేపం చేస్తున్నాడు జయరాం.

భార్య క్రొత్త సినిమాలు చూడటంలేదని, ఇంట్లో అవిలేవు యివిలేవని అసంతృప్తికరంగా మాట్లాడుతూ జయరాంను యాతనపెడుతున్నది. తను మాత్రం యేవిధంగాను తొణకకుండా అన్నింటిని పెడచెవినిబెడుతూ ప్రశాంతంగా వుంటున్నాడు. కానీ అంతరంగికంగా అతన్ని యేమిటో బాధపెడుతున్నది. ఏవేవో అశుభసూచనలు అతన్ని చిరాకు నందజేస్తునయి.

తేలుకుట్టిన దొంగలాగా కాపరంచేస్తున్నాడు జయరాం. ఒకనాడు సాయంత్రం ఆఫీసులో పగలల్లా పనితో కష్టపడీపడీ యింటికివచ్చాడు. భార్య షోకుచేసుకొని, చిఱునవ్వుదొంతరులతో భర్తచేతిలోని కోటు వయ్యారంగా అందుకొని వంకెలుకు తగిలించింది. పడకకుర్చీలో వ్రాలిన భర్తకు లైటు టిఫిన్ అందించింది. అరకప్పు చక్కని కాఫీ కలిపియిచ్చింది. యెంతోఆప్యాయనంగా ఆరగించాడు. వక్కచూర నోట్లోవేసి ప్రక్కనే కూర్చుంది. నెమ్మదిగా ''మన యింటిప్రక్క రుక్మిణి సుబ్బారావులు ..క్రొత్తగావచ్చిందట 'లైలామజ్ను' అనే సినిమా సరస్వతీహాల్లోకి. మనంకూడా తప్పక వెళ్ళుదాం!'' అని లేతనవ్వు వలకబోసింది.

''డబ్బులేదు'' అని నిస్సారంగా అన్నాడు జయరాం.

'మనకెప్పుడూ డబ్బువుండదు' అని విసుకుంటూ లోపలికి ఓమారు విసురుతో వెళ్ళివచ్చింది,

"సంసారపరిస్థితులు ఆవగింజంత అయినా తెలుసుకోకుండా యెప్పుడు సినిమాలంటే యెక్కడ నించివస్తయి'' అని తిరిగి జయరాం నెమ్మదిగా అన్నాడు, హెచ్చరించినట్లు.

"సంసార పరిస్థితులు యెప్పుడులేవు? సినిమా అనంగానే అవేవస్తాయి.''

జయరాం మాట్లాడలేదు.

"భార్యకోర్కెను ఆమాత్రం తీర్చలేనివారు ముందుగా సన్యాసంతీసుకుంటే?'' అని చమత్కారంగా అన్నది. కాని ఆమాటలు శూలాలులాగా పొడుచుకున్నాయి జయరాంకు. ఆమాటలు జయరాంకు యేవేవో క్రొత్తమార్గాలు సూచించాయి. తనకు సంసారంలో గ్రుచ్చుకుంటున్న వాడిముండ్లు చక్కని సుమాలుఅయ్యేటట్లు వున్నాయి. తన మానసంలోని భావార్ణవం ఘూర్ణిల్లింది ఒకమారు. కాని తొణకలేదు. అతిప్రశాంతంగా వున్నట్లు వున్నాడు.

మఱునాడు ఆఫీసుకు వెళ్ళటం అదేవెళ్ళటం యెక్కడికో తనకే తెలీదు. తండ్రికి మాత్రం ఊరు పేర్లు తెలియజేయకుండా తన క్షేమసమాచారాలు తెలుపుతున్నాడు. వారానికోమారు తిన్నచోట వుండటంలేదు. ఉన్నచోట పరుండటంలేదు. ప్రాణాపాయాన్ని కలుగజేసే తీవ్రమైన జ్వరం అనేకమార్లు అనుభవించాడు. కాని అతని విరక్తిబలం అతనిని వెనుకంజవేయనీయలేదు. సన్యాసులకు నిలయమయిన హిమాలయములోని హృషీకేశం జేరాడు. నలుగురిని పరిచయం చేసుకొన్నాడు. కాషాయివస్త్రాలు ధరించాడు. సుఖంగా కాలయాపన చేస్తున్నాడు, చక్కని వేదాంతగోష్ఠులతోటి.

అప్పుడే జయరాం కాదుకాదు అద్వైతానం[ద] ఇల్లువదలిపోయి మూడుసంవత్సరాలు నిండాయి. త[ల్లి]దండ్రులు కొడుకు వియోగపరితాపంతో కృశి[ం]చిపోతున్నారు. భార్య చల్లగా పుట్టిల్లు జేరుకు[ంది]. ఎక్కడయిన కొడుకుజాడలు తెలుస్తాయేమో [అ]ని కనిపించినవారితో నల్లా ప్రస్తాపిస్తున్నాడు. [తం]డ్రి

యాత్రలకు వెళ్ళివచ్చినవారిద్వారా జయరాం కబురు తెలిసింది. తండ్రి సంతోషంతో యెదిగిన తమ్ముడ్ని పంపించాడు అతన్ని తీసుకురమ్మని. బ్రతిమాలగా బ్రతిమాలగా రెండునెలలకు జయరాం తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. అతని కంఠస్వరం, స్వరూపం అంతా మారిపోయాయి. మాతృభాషకూడా బాగా మాట్లాడలేని స్థితివచ్చింది. ఊళ్ళో పెద్దలంత వచ్చారు. సాష్టాంగదండప్రణామాలు ఆచరించారు. వేదాంతగోష్ఠులు జరిపారు. 'తండ్రి యెంత అదృష్టవంతుడు, ఇంత మహాజ్ఞానిని కన్నాడు.! ఆదివరకు లాగా గాదురో జయరాం, మహాజ్ఞాని అయినాడు' అన్నారు సహపాఠకులు, మిత్రులు. తండ్రి పెద్దల చేత తిరిగి సంసారం స్వీకరించవలసిందిగా చెప్పించాడు. "రామ, రామ! తిరిగి సంసారమే!'' అన్నాడు జయరాం. భార్యవచ్చింది. భర్తకు నమస్కరించింది. మొదటి రెండురోజులు దూరంగా వున్నాడు. మూడోరోజున "అయిందే! రామయ్య కొడుకు కోడలు కలిసారట నిన్న'' అని అమ్మలక్కలు తాజావార్తలు బ్రాడ్‌కాస్టు చేశారు. "మానసిక సన్యాసం కావాలిగాని, కాషాయవస్త్రాలు ధరించగానే సరిగ్రా'' అనుకొన్నారు పెద్దలు. పదిరోజులు గడిచాయి. తండ్రికి తల్లికి పాతబడ్డారు.

"పనిపాటలు లేకపోతే మిమ్మల్ని యెవరు పోషింపగలరోయి'' అన్నది తల్లి. అద్వైతానందకు యేమీతోచలేదు. తాను మళ్ళీ తిరిగి ప్రపంచంలో గృహస్థులాగా సంచరించటం అవమానం వేసింది. మొదటి యేపరిస్థితుల్లో తాను సన్యాసం స్వీకరించవలసింది తిరిగి తానాస్థితిలో యిప్పుడు మళ్ళీ దాన్నే ఆశ్రయించవలసివచ్చింది.

"ఏడీ! అద్వైతానంద! ఏడీ జయరాం!'' అని అడిగింది లోకం. సమాధానం రాలేదు. ఆ మూగకంఠంనుండి "విరక్తిలో ముక్తి నపేక్షించే వాళ్ళందరిగతి యింతే'' అనే మహత్తరహితబోధ వినిపించింది లోకానికే.